www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 30 జులై 2025
5
అన్నమయ్య




పట్టాభిషేక మహోత్సవాలకు అంకురార్పణ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిపురం పట్టణ నడ్డిబొడ్డున వెలసిన శ్రీ పట్టాభిరాముడి పట్టాభిషేక మహోత్సవాలు మంగళవారం సాయంత్రం అంకురార్పణతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి సుప్రభాతసేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం అర్చన, అభిషేకం, తోమాలసేవ, నిత్య సేవలు నిర్వహించారు. సాయంత్రం టిటిడి వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ శ్రీ కలశస్థాపన, హోమాది కార్యక్రమాలు, సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, టిటిడి అధికారులు, వేదపండితులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



అంకురార్పణ నిర్వహిస్తున్న వేదపండితులు, టిటిడి అధికారులు



'స్థానిక' వేడి షురూ!

జడ్పిటిసి అభ్యర్థుల ఎంపికలో నాయకులు బిజీ

జడ్పి చైర్మన్‌తో రాజంపేట ఎమ్మెల్యే మంతనాలు

అధికార టిడిపిలో అయోమయం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి రాజుకుంది. జిల్లాలోని ఒంటిమిట్ట, పులివెందుల జడ్పిటిసి అభ్యర్థుల ఎంపికపై అధికార టిడిపి, వైసిపి తమదైన కసరత్తు చేస్తున్నాయి. వైసిపి ఒంటిమిట్ట జడ్పిటిసి అభ్యర్థి ఎంపిక విషయంలో మంగళవారం రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాధరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి, ఇతరులను కలిసి సంప్రదింపులు చేస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలోనే రాజంపేట అసెంబ్లీ ప్రత్యేకతను కలిగి ఉంది. రాజంపేట పార్లమెంట్ పరిధిలో ఎమ్మెల్యే, లోక్‌సభ సభ్యులు, రాజ్యసభ సభ్యులను కలిగి ఉంది. రాజంపేట ఎంపీ పి.వి. మిథున్‌రెడ్డి లిక్కర్ స్కామ్‌లో నిందితుడిగా రాజమండ్రి జైలులో ఉండటాన్ని మినహాయిస్తే మిగిలిన రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాధరెడ్డి క్రియాశీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటిమిట్ట జడ్పిటిసి అభ్యర్థిగా గెలిచిన ఆకేపాటి అమరనాధరెడ్డి జడ్పి చైర్మన్‌గా నియమితులైన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల్లో చైర్మన్ పదవికి రాజీనామా చేసి రాజంపేట బరిలో దిగి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బ్రహ్మంగారిమఠం జడ్పిటిసి ముత్యాల రామగోవిందరెడ్డి చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆగస్టు ఒకటిన జడ్పిటిసి స్థానాలకు నామినేషన్ దాఖలు చేయాల్సిన నేపథ్యంలో ఒంటిమిట్ట ఎన్నికల బరిలో అభ్యర్థిగా ఎవరిని నిలపాలనే అంశంపై సంప్రదింపులు చేస్తుననట్లు తెలుస్తోంది. గతంలో జడ్పిటిసిగా ఎన్నికైన ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, లేక మరెవరినైనా నిలుపుతారా అనే అంశంపై అందరి దృష్టి నిలిచింది. వీరిలో ఎవరు ఎన్నికల బరిలో నిలవడానికి సమర్థులు, ఎవరు ముందుకు వస్తారనే అంశం అందరినీ ఆకర్షిస్తోంది. రాష్ట్రంలో టిడిపి అధికారంలో ఉన్న పరిస్థితుల్లో ప్రత్యర్థి వైసిపి తరుపున బరిలో నిలిచి గెలవడం అంత సులభం కాని పరిస్థితులు నెలకొన్నాయి. పులివెందుల జడ్పిటిసి అభ్యర్థి ఎంపిక విషయంలో కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి కీలకపాత్ర పోషించే అవకాశం ఉంది. పార్లమెంట్ సమావేశాల్లో బిజీగా ఉన్న నేపథ్యంలో ఎవరిని ఎంపిక చేస్తారో అనే ఆసక్తి వైసిపి కేడర్‌లో నెలకొని ఉంది. అధికార టిడిపిలో అయోమయం నెలకొంది. రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అంశంలో స్పష్టత కొరవడింది. ప్రస్తుత రాజంపేట టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు అభ్యర్థి ఎంపికలో క్రియాశీలకంగా వ్యవహరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒంటిమిట్ట జడ్పిటిసి అభ్యర్థిగా తప్పిటవారిపల్లికి చెందిన గజ్జెల నరసింహారెడ్డిని నియమిస్తారా, లేక ఇతరులెవరిని నియమిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.టెక్ రవి జడ్పిటిసి అభ్యర్థి నియామకంలో కీలకంగా వ్యవహరించే అవకాశం కనిపిస్తోంది. ఏదేమైనా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అధికార వైసిపి, టిడిపి నాయకుల్లో ఉత్కంఠ నెలకొన్నట్లు కనిపిస్తోంది.

నేటి నుంచి జడ్పిటిసి ఎన్నికకు నామినేషన్లు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల జడ్పిటిసి స్థానానికి బుధవారం నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. జడ్పిటిసి మహేశ్వర్‌రెడ్డి మృతి చెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. మొత్తం ఓటర్లు 10,601 మంది ఉండగా వాటిలో స్త్రీలు 5464 మంది, పురుషులు 5137 మంది ఉన్నారు. ఈనెల 30 నుంచి ఆగస్టు 1 సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 2న పరి శీలన, 3న తిరస్కరణ, 5న మధ్యాహ్నం 3 గంటల లోపల ఉపసంహరణ, ఆగస్టు 12న ఎన్నికలు నిర్వహించనున్నారు. 14న ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు.

పోటీనా.. ఏకగ్రీవమా అనేదానిపై ఉత్కంఠ

ఆర్.తుమ్మలపల్లె గంగమ్మ జాతరలో ప్రమాదవశాత్తూ జడ్పిటిసి మహేశ్వర్‌రెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ స్థానానికి ఉప ఎన్నికలు రావడంతో పోటీ జరుగుతుందా లేక ఏకగ్రీవం అవుతుందా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. మహేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యుల్లో ఒకరిని వైసిపి అభ్యర్థిగా నిలిపితే ఏకగ్రీవం అవుతుందని చర్చ జరుగుతోంది. అలాకాకుండా ఇతరులను ఎవరిని అభ్యర్థులుగా నిలిపిన టిడిపి తమ అభ్యర్థులను నిలుపుతుంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ఎన్నికలు జరిగితే ఉత్కంఠగా మారే అవకాశం ఉంది. ఏది ఏమైనప్పటికీ ఉప ఎన్నికలు రాజకీయ పార్టీలకు, అధికారులకు సవాలుగా మారనుంది.

రాయచోటిలో దారుణం

- వివాహం చేయలేదని మనస్థాపంతో అక్కాచెల్లెల్లు ఆత్మహత్యాయత్నం
- కడప రిమ్స్‌కు తరలిస్తుండగా అక్క, చికిత్స పొందుతూ చెల్లెలు మృతి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

తల్లిదండ్రులు వివాహం చేయలేదన్న కారణంతో మనస్థాపానికి గురైన ఇద్దరు యువతులు (అక్కాచెల్లెల్లు) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తలుపులు మూసుకొని కిరోసిన్ పోసుకొని నిప్పు అంటించుకొన్న ఘటన మంగళవారం రాయచోటి పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్ళితే.. రాయచోటి పట్టణం బోస్‌నగర్ పూజారిబండ వీధిలో ఫాతిమా (22), అఫ్రీన్ (18) అనే ఇద్దరు అక్కాచెల్లెళ్లు ఇంట్లో ఎవరూ లేని సమయంలో కిరోసన్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో అక్కాచెల్లెలు ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఇంట్లో నుంచి కేకలు, మంటలు, దట్టమైన పొగలు రావడంతో చుట్టుపక్కల వారు గమనించి ఇంటి తలుపులు బద్దలు కొట్టి ఇంట్లోకి వెళ్లి మంటలను ఆర్పేశారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు హుటాహుటిన ఘటన స్థలాన్ని చేరుకుని తీవ్ర గాయాలతో ఉన్న అక్కాచెల్లెలు ఇద్దరినీ స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఫాతిమా (22), అఫ్రీన్ (18) పూర్తిగా కాలిపోవడంతో పరిస్థితి విషమంగా మారింది. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. తండ్రి జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లి వచ్చిన కూడా పెళ్లి సంబంధాలు చూడడం లేదని మనస్థాపం చెందిన ఇద్దరు అక్కాచెల్లెలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న రాయచోటి కోర్టు జడ్జి ఆసుపత్రికి చేరుకుని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఫాతిమా, అఫ్రీన్‌ల నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. వీరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం వైద్యులు కడప రిమ్స్‌కు తరలించారు. మార్గ మధ్యలో ఫాతిమా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అఫ్రీన్ మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు అర్బన్ సిఐ పి.వెంకట చలపతి తెలిపారు.

2న ఉద్యోగ, ఉపాధ్యాయుల ధర్నా : ఫ్యాప్టో

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆగస్టు 2వన ధర్నాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫ్యాప్టో చైర్మన్, సెక్రటరీ జనరల్ ఎస్.జాబీర్, గఫార్‌ఖాన్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎస్‌టియు కార్యాలయంలో నిర్వహించిన ఫ్యాప్టో సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య రాష్ట్రశాఖ యిచ్చిన పిలుపుమేర విద్యారంగం, ఆర్థిక సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ ఎదుట ధర్నాను నిర్వహించనున్నామని చెప్పారు. పి4 కార్యక్రమంలో పాల్గొనాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి తేవడం సరికాదన్నారు. నూతనంగా అప్‌గ్రేడ్ అయిన స్థానాలను కోరుకున్న ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలంటూ కోరారు. ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యలను పరిష్కరించి విద్యాశాఖలో ఉన్న అసంబద్ధ తను తొలగించాలన్నారు. 72, 73, 74 జిఒలను వెంటనే అమలు చేయాలన్నారు. 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలంటూ డిమాండ్ చేశారు. అంతర్ జిల్లాల బదలీలను వెంటనే చేపట్టాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ధర్నాకు ఉపాధ్యాయ, ఉద్యోగులంతా పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలంటూ వారు విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టోనేతలు శివా రెడ్డి, సిబాతుర్ రహిమాన్, రవీంద్రారెడ్డి, గోపికృష్ణ, రామకృష్ణ, జాఫరుద్దీన్, శివశంకర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఫ్యాప్టో జిల్లా చైర్మన్ జాబీర్

ప్లీనరీని జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మండల విద్యాశాఖ అధికారులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ కోరారు. మంగళవారం ప్లీనరీ సమావేశాలకు సంబంధించిన కరపత్రాలు మండల విద్యాశాఖ అధికారులు రఘురామరాజు, సుబ్బరాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరవీరుల ఉద్యమ స్ఫూర్తితో, పోరాట నినాదంతో 1970లో కేరళలోని త్రివేండ్రంలో ఏర్పడిందని తెలిపారు. నరసింహ మాట్లాడుతూ అందరికీ విద్యా ఉపాధి అందాలని కోరుతూ భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణకై ఆగస్టు 3, 4వ తేదీలలో ప్లీనరీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలకు జిల్లా నలుమూలల నుండి 300 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఏడాదిలోగా విద్యారంగాన్ని చక్కదిద్దుతామని రాష్ట్రాన్ని విద్యలో అగ్రగామిగా నిలుపుతామని గతంలో మంత్రి నారా లోకేష్ ప్రకటించినప్పటికీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. విద్యాశాఖ చేస్తున్న ప్రతిపాదన పాఠశాల విద్యను పూర్తి ప్రయివేటీకరించే దిశలో ఉన్నాయన్నారు. ఉన్నత విద్యను ప్రయివేట్, కార్పొరేట్ సంస్థలకు పూర్తిగా ధారా దత్తం చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో నాడు-నేడు పథకం ద్వారా వేలాది ప్రాథమిక పాఠశాలలు నిర్మాణం జరిగిందని, ప్రస్తుతం ఆ ప్రాథమిక పాఠశాలల నుండి తరగతి గదులను సరైన సదుపాయాలు లేని ఉన్నత పాఠశాలలకు బదిలీ చేయడం ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలకు మచ్చుతునకగా నిలుస్తుందన్నారు. జాతీయ విద్యా విధానం 2026 ఆధారంగా ఈ మార్పులు చేశామంటున్న పాలకులు జాతీయ విద్యా విధానంలో పేర్కొన్నట్లుగా పూర్వ ప్రాథమిక తరగతులను ప్రాథమిక విద్యను విలీనం చేయలేదని పేర్కొన్నారు. పైసమస్యలన్నిటిపై ప్లీనరీ సమావేశలలో చర్చించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు లతీఫ్, జిల్లా సహాయకార్యదర్శి మదన్ మోహన్‌రెడ్డి, క్రితిష్ పాల్గొన్నారు.

'ఆకాంక్షలు నెరవేర్చడం పిల్లల బాధ్యత'

ప్రజాశక్తి-పీలేరు

తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చడం పిల్లల కనీస బాధ్యతని, అమ్మను ప్రేమించే ప్రతి ఒక్కరూ ఆ గుర్తుగా ఒక మొక్కను నాటి పెంచాలని స్వర్ణభారత్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ తెలిపారు. మంగళవారం పీలేరులోని విఎస్ఎన్ సిద్ధార్థ విద్యా సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఏక్ పేడ్ మాకే నామ్ (అమ్మ పేరిట ఒక మొక్క) కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ లోకంలో ఎలాంటి పరిమితులు, షరతులు లేకుండా ప్రేమను పంచేది తల్లి ఒక్కటేనని, తల్లి తరువాత మొక్కలు మాత్రమే ప్రేమగా స్వచ్ఛమైన ప్రాణవాయువును అందించగలవని పేర్కొన్నారు. అందుకనే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమం ద్వారా దేశంలో పచ్చదనం పెంపు కోసం నడుంబిగించారని పేర్కొన్నారు. తన తండ్రిని స్ఫూర్తిగా తీసుకుని స్వర్ణ భారత్ ట్రస్టు స్థాపించి దాని ద్వారా నేటికి 1.85 లక్షల మందికి ఉపాధి అవకాశాలు, 6 లక్షల మందికి ఉచిత వైద్య సదుపాయం కల్పించామని పేర్కొన్నారు. బాలబడి మొదలుకొని సిబిఎస్ఇ పాఠశాల వరకు నిర్వహిస్తూ వేలాది మంది విద్యార్థులకు ఉచితంగా, నామమాత్రపు రుసుంతో విద్యాబుద్ధులు నేర్పుతున్నామని పేర్కొన్నారు. జీవితంలో ఉన్నతంగా స్థిరపడడానికి విద్యార్థి దశ ఎంతో కీలకమని, ఆ దశలో క్రమశిక్షణతో మెలిగి తాము అనుకున్న లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఒక నిర్దిష్ట ప్రణాళిక రూపొందించుకుని, టివి, సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ ప్రణాళికాబద్ధంగా అభ్యసిస్తే మంచి ఫలితాలు సాధ్యమని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చిన వారే నిజమైన బిడ్డలని, ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని పేర్కొన్నారు. పీలేరు వంటి గ్రామీణ ప్రాంతంలో గడిచిన 25 ఏళ్లుగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విఎస్ఎన్ విద్యా సంస్థ ఎంతో అభినందనీయమని కొనియాడారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్క నాటారు. కార్యక్రమంలో విఎస్ఎన్ సిద్ధార్థ విద్యాసంస్థల అధినేత్రి వడ్లమూడి మాధవి, డాక్టర్ పొత్తూరి శ్రీకాంత్, విష్ణు మోటార్స్ సిఇఒ చేబ్రోలు శ్వేత, ఎంఇఒలు లోకనాథరెడ్డి, పద్మావతమ్మ, ఎఫ్ఆర్ఒ చంద్రశేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దీపా వెంకట్



అర్జీదారులతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాదర్‌రెడ్డి

అధికారులు జవాబుదారీతనంగా పనిచేయాలి

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి/చిన్నమండెం

ప్రజలు ఇచ్చే ప్రతి అర్జీకీ అధికారులు, ప్రజాప్రతినిధులు జవాబుదారీతనంగా పని చేయాలని రవాణా, క్రీడల, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం తన క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజలకు సకాలంలో నాణ్యమైన విద్యుత్తును అందించి, రెవెన్యూ సమస్యలను తొందరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా కొంతమంది అధికారులు, నేతలు, ప్రజలు మంత్రికి పుష్పగుచ్ఛంతో సత్కరించి సన్మానించారు. చిన్నమండెం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో కూడా మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పేదలకు సంక్షేమ పథకాలు అందక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారిని ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిజమైన పేదలను గుర్తించి వారందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు.

నేటి నుంచి పి4 గ్రామసభలు

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

మండలంలోని గ్రామాలలో పి4 గ్రామసభలు ఈనెల 30 నుంచి నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేకాధికారి నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు శిబ్యాల, సాయంత్రం 3 గంటలకు గొర్లముదివేడు గ్రామసచివాలయాలలో గ్రామసభలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. గ్రామసభల ప్రత్యేకాధికారిగా జిల్లా టూరిజం అధికారి నాగభూషణం వ్యవహరిస్తారన్నారు. 31న ఉదయం 10 గంటలకు ఎంపిడిఒ సురేష్‌బాబు అధ్యక్షతన దిగువఅబ్బవరం గ్రామం జడ్‌పి హైస్కూల్‌లో, సాయంత్రం పెమ్మాడపల్లె ఎంపిఇపి స్కూల్‌లో గ్రామసభలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆగస్టు 1న ఉదయం చెన్నముక్కపల్లె-1, 2 సచివాలయాల పరిధిలోని లబ్దిదారులకు గ్రామ సచివాయంలో, 2న ఉదయం మాధవరం-1, 2 సచివాలయాల్లో, సాయంత్రం బొట్లచెరువు సచివాలయాలలో సభలు నిర్వహిస్తారని తెలిపారు. 4న ఉదయం యండపల్లె సచివాలయంలో గ్రామసభ నిర్వహిస్తారన్నారు. అన్ని గ్రామాలలో ఇప్పటికే ఎంపిక చేసిన బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే వారిని ఎంపికచేస్తారన్నారు. గ్రామసభలకు ఎంపిక చేసిన బంగారు కుటుంబాల లబ్దిదారులంతా తప్పక హాజరుకావాలంటూ కోరారు.

వన్ టౌన్ సిఐ ఎరిసావలి సస్పెన్షన్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



మదనపల్లె ఒకటవ పట్టణ సిఐ ఎరిసావల్లిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. మదనపల్లెలో ఇటీవల చోటుచేసుకున్న కొన్ని ఘటనలపై సిఐ చురుకుగా స్పందించకపోవడం, విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వంటి అభియోగాలపై సిఐని సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది. జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ నుంచి ఇచ్చిన పని అతిక్రమించిన వారిపై చర్యలకు వెనుకాడరని సిఐ సస్పెన్షన్ మరోసారి తేట తెల్లం చేస్తోంది.

31 లోపు ఇంటర్‌లో చేరాలి : ప్రిన్సిపల్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరడానికి ఈ నెల 31వ తేది చివరి రోజని కళాశాల ప్రిన్సిపల్ గోపతి బాలకృష్ణ మూర్తి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పాసై ఇంకా అడ్మిషన్లు పొందని విద్యార్థినిలు ఈ అవకాశాన్ని ఉపయోగించు కోవాలని కోరారు. టెన్త్ క్లాస్ డ్రాప్ అవుట్స్‌గా మిగలరాదని ప్రతి ఒక్కరూ ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరి విద్యను కొనసాగిస్తూ తల్లికి వందనం పొందాలని సూచించారు. ఆ విధంగా ప్రభుత్వ ఆశయ సాధనకు ప్రతి అధ్యాపకుడు ప్రతి కళాశాల ఉద్యోగి పని చేయాలన్నారు. ఈ రెండు రోజులలో మదనపల్లెలో సర్వే నిర్వహించి టెన్త్ క్లాస్ పాసైన డ్రాప్ ఔట్స్ ను గుర్తించి కళాశాలలో చేరేటట్లు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. గత ఏడాది లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల రెండవ సంవత్సర విద్యార్థులు ప్రయివేట్ కళాశాలలకు దీటుగా అదుతే ఫలితాలు సాధించినట్లు చెప్పారు. బైపిసిలో వెయ్యి మార్కులకుగాను 982 మార్కులు సాధించారన్నారు. బైపిసి, ఎంపిసి హెచ్‌ఇసి గ్రూపులలో కూడా 900కు పైగా మార్కులు సాధించారన్నారు. ఒకేషనల్ విభాగంలో బాలికల కళాశాల విద్యార్థులు 900పైగా మార్కులు సాధించారన్నారు. మొదటి సంవత్సరంలో ఎంపిసిలో 449, 456 హెచ్‌ఇసిలో 478, సిఇసిలో 434, బైపిసిలో 421 మార్కులు సాధించారన్నారు. ఈ ఏడాది మా కళాశాలలో 290 మంది విద్యార్థులు చేశారన్నారు. గత ఏడాది కంటే ఎక్కువ మంది కళాశాలలో చేరారన్నారు. కళాశాలలో పోటీ పరీక్షలు, ఎంసెట్, నీట్, ఈసెట్, ఐఐటి వంటి ఎగ్జామినేషన్స్‌కు శిక్షణ ఇవ్వబడుతుందని, వారాంతపు టెస్టులు, అసైన్మెంట్లు నిర్వహించడం జరుగుచున్నాయని వెల్లడించారు. కళాశాలలో మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత నోట్ బుక్కులు, ఉచిత రికార్డులు అందజేస్తామన్నారు. అన్ని విభాగాలలో లెక్చరర్లు పూర్తి స్థాయిలో ఉన్నారని, అన్ని సబ్జెక్టులకు మంచి బోధన జరుగుతున్నదని చెప్పారు. కళాశాలలో 80 శాతం ఉత్తమ ఫలితాలు సాధించామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కళాశాలను సందర్శించి, సౌకర్యాలను గుర్తించి, బోధనా సదుపాయాలను తెలుసుకుని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తమ పిల్లల్ని చేర్చాలని కోరారు. క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు, గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో శిక్షణ, ఎన్ఎస్ఎస్, స్కౌట్స్ అండ్ గైడ్స్ వంటి ప్రత్యేక విభాగాల ద్వారా సామాజిక అవగాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు.



తనిఖీ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

తహశీల్దారు కార్యాలయంలో జెసి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పీలేరు

కంభంవారిపల్లి తహశీల్దారు కార్యాలయాన్ని మంగళవారం జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా మండలంలో చేపట్టిన రీ సర్వే జరుగుతున్న తీరు, పిజిఆర్ఎస్‌లో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు, వెబ్ లాండ్ సవరణల కొరకు పంపిన ప్రతిపాదనలు మొదలగు విషయాలపై విచారణ జరిపారు. పిజిఆర్ఎస్‌లో ప్రజల నుంచి స్వీకరించిన విన్నపాలను పరిశీలించి వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దారు బి.నరేంద్ర కుమార్ ని ఆదేశించారు. కార్యక్రమంలో మండల స్థాయి రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

లులూకు భూ కేటాయింపులు తగవు : వైసిపి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

టెండర్లు పిలిచి ఎవరైతే ఎక్కువ మొత్తానికి బిడ్ వేస్తారో వారికే భూ కేటాయింపులు చేయాలని మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల ఆయన మాట్లాడుతూ వైజాగ్, విజయవాడలో దుబాయ్ సంస్థ లులూ గ్రూప్ భారీ మాల్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోందని, తక్కువ ధరలకు కేటాయించిన భూములపై కూటమి ప్రభుత్వ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో విశాఖలో మాల్ ఏర్పాటు కోసం లులూ గ్రూప్ కు అప్పటి చంద్రబాబు ప్రభుత్వం భారీగా భూమి కేటాయించగా ఆ తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం దాన్ని రద్దు చేసిందనే విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు విశాఖతో పాటు లులూ మాల్ ఏర్పాటు కోసం విజయవాడ నడిబొడ్డున రూ.400 కోట్ల విలువైన స్థలం కేటాయింపు ప్రతిపాదనను తప్పుబట్టారు. ఒకవైపు కక్షసాధింపులు, మరోవైపు ప్రభుత్వ భూములను బినామీలకు కారుచౌకగా అప్పగించి, తద్వారా జేబులు నింపుకునేందుకు సిఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా బోధన : డిఇఒ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ఉపాధ్యాయులు బోధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సుబ్రమణ్యం అన్నారు. మండలంలోని గ్రీన్‌వ్యాలీ పాఠశాలలో జరుగుతున్న పది జిల్లాల కెజిబివి టీచర్ల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీచర్లు సామాజిక బాధ్యత వహించి విద్యార్థులలో సామాజిక స్పృహ కల్పించాల్సిందిగా కోరారు. విద్యార్థుల్లో ఉపాధ్యాయులు స్ఫూర్తి నింపాలన్నారు. సామాజిక అంశాల పట్ల విద్యార్థులకు ఉత్తమ అవగాహన కల్పించటం ద్వారా వారిని పోటీ ప్రపంచంలో ముందుంచగలమన్నారు. కస్తూరి బా పాఠశాలల్లో విద్య అభ్యసిస్తున్న పేద బాలికలను దత్తత తీసుకుని వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల మీద ఉందని పేర్కొన్నారు. కార్యక్రమములో కెజిబివి రాష్ట్ర డిప్యూటీ డైరెక్టరు సి.దేవరాజు, సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి కరుణాకర్, సమగ్ర శిక్ష పూర్వ సెక్టోరల్ ఆఫీసర్ పఠాన్ మహమ్మద్ ఖాన్, వెండర్ చంద్రశేఖర్‌రెడ్డి, గ్రీన్ వ్యాలీ విద్యాసంస్థ చైర్మెన్ నాగరాజు, డైరెక్టరు రంగా రెడ్డి, అడ్మిన్ దివాకర్, రిసోర్స్ పర్సన్లు, 10 జిల్లాల నుండి హాజరైన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఇఒ సుబ్రమణ్యం



ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను సత్కరిస్తున్న టిడిపి నాయకులు

ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు సన్మానం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను ఆంధ్రప్రదేశ్ శాసనసభ మైనార్టీ కమిటీ చైర్మన్‌గా నియమించడం అభినందనీయమని, భవిష్యత్తులో ఆయన మరిన్నీ ఉన్నతమైన పదవులు అదిరోహించాలని రాజంపేట పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మాజీ జడ్‌పిటిసి సుజాత, రాచవేటివారిపల్లె సర్పంచ్ సుబ్రమణ్యం, నాయకులు శంకరతో కలిసి ఎమ్మెల్యేను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌జె మాట్లాడుతూ ప్రజాసేవలో నిరంతరం నిమగ్నమై ఉన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ శాసనసభ మైనార్టీ కమిటీ చైర్మన్‌గా నియమించడం అభినందనీయమన్నారు. ప్రజా నాయకుడిగా గుర్తింపు తెచ్చుకుంటున్న ఆయన మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే నాయకత్వంలో మదనపల్లె ఓ కొత్త రూపరేఖలను సంతరించుకోబోతోందని అన్నారు. మదనపల్లి అభివృద్ధికి ఆయన అలుపెరగని శ్రామికుడిలా కృషి చేస్తున్నారని అన్నారు. ఆయనకి కూటమి నాయకులు నిరంతరం అండగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వెంగంవారిపల్లెలో సివిల్ రైట్స్‌డే

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని వెంగంవారిపల్లె గ్రామం దేవిరెడ్డి దళితవాడలో బుధవారం పౌర హక్కుల పరిరక్షణ దినోత్సవ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ తపస్విని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినెల 30న క్రమ పద్ధతిలో మండలంలోని ఒక గ్రామంలో పౌర హక్కుల పరిరక్షణ దినోత్సవ సమావేశాన్ని నిర్వహిస్తూ, ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తూ వస్తున్నామని అన్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని అన్నారు.అధికారులు, ప్రజా ప్రతినిధులు, సంబంధించిన దళిత సంఘాల నాయకులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి దయాకర్‌రెడ్డి

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-కలకడ

సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల ప్రత్యేక అధికారి దయాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులకు సమాచార హక్కుచట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు.మండలంలోని ప్రతి గ్రామంలోని ప్రజలకు సమాచార చట్టంపై పంచాయతీ కార్యదర్శులు అవగాహన కలిగించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎవరైనా గానీ, ఏదైనా విషయం, సమస్య పైన సంబంధిత అధికారులను కోరినట్లయితే వారికి తప్పకుండా సమాచారం అందించినవలసిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు.కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ ప్రతాప్‌రెడ్డి, ఎంఇఒ మునీంద్రనాయక్, ఎపిఒ సుజాత, ఎపిఎం పురుషోత్తంరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందిపాల్గొన్నారు.

ఫూలే, అంబేద్కర్ ఆశయసాధనే లక్ష్యం

ప్రజాశక్తి-వీరబల్లి

బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం కేక్‌కట్ చేసి ఉపాధ్యాయులకు పంచి పెట్టుకున్నారు. ఫూలే అంబేద్కర్ ఆశయసాధనే లక్ష్యంగా బహుజన టీచర్స్ అసోసియేషన్ పనిచేస్తుందని జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వల్లూరు జయన్న పేర్కొన్నారు. బిటిఎ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పల్లం రామచంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ఉపా ధ్యాయ ఉద్యమాలలో బహుజనుల క్రియాశీలక పాత్రను నిర్వహిం చేందుకే బిటిఎ ఆవిర్భవించిందన్నారు. సమాజంతో పోలిస్తే బహుజనుల సమ స్యలు ప్రత్యేకమైనవని వాటిని గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. రాష్ట్రంలోని ఫ్యాప్టోతో కలిసి ఉపాధ్యాయులు సమస్య లపై నిరంతరం పోరాటం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బిటిఎ నాయకులు పాల్గొన్నారు.

బ్లాక్‌లో ఇండియన్ గ్యాస్ సిలిండర్ల అమ్మకాలు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని గోపగుడిపల్లి పంచాయతీ కాంపల్లి చెందిన రాజారెడ్డి అనే వ్యక్తి బ్లాకులో ఇండియన్ గ్యాస్ సిలిండర్ అధిక రేట్లకుతో విక్రయిస్తున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇంట్లో అధికంగా సిలిండర్లు నిల్వ ఉంచడం వల్ల ఏదైనా అగ్ని ప్రమాదం వాటిల్లితే గ్రామం మొత్తం ఏమవుతుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజారెడ్డి గత మూడు సంవత్సరాల నుంచి ఇలాంటి వ్యాపారం చేస్తున్నారని, గ్రామస్తులు ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదని తెలిపారు. ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వారి దృష్టికి తీసుకుపోయిన ఫలితం లేదన్నారు ఇప్పటికైనా అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకొనితమ గ్రామాన్ని ప్రమాదం నుండి రక్షించాలని కోరుతున్నారు.

మాదక ద్రవ్యాలు సేవించడం నేరం

ప్రజాశక్తి - లింగాల

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ శేషయ్య పేర్కొన్నారు. పెద్దకుడాల జిల్లాపరిషత్ హైస్కూ లో మంగళవారం స్నేహిత అమృత హస్తం సేవా సమితి ఆధ్వ ర్యంలో 'మాదక ద్రవ్యాలు నిర్మూలన.. మనందరి బాధ్యత' అవగాహన కార్యక్ర మంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ గంజాయి, కోకైన్, పొగాకు వంటి మాదక ద్రవ్యాల పట్ల యువత దూరంగా ఉండాలన్నారు. అసాంఘిక కార్యక్ర మాలు నివారించే దిశగా అడుగులు వేయడం విద్యార్థి దశ నుంచి అలవ రచుకోలన్నారు. మానసిక ఒత్తిడి జయించేందుకు యోగాను అలవాటు చోసుకోవాలన్నారు. అనంతరం మాదకద్రవ్యాలు నివారణ పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ రామకృష్ణయ్య, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు వాసుదేవరెడ్డి, ప్రాథమిక వైద్యశాల సూపర్‌వైజర్ ఆశాబేగం పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి - చాపాడు

వరి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారి దేవి పద్మలత సూచించారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఎన్ ఓబాయపల్లె, అయ్యవారిపల్లె గ్రామా లలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంటసాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని తెలిపారు. అధిక మోతాదులో యూరియా వాడరాదన్నారు. ఒక ఎకరాకు వరి పైరు పంటకాలం మొత్తం కేవలం 90 కిలోల యూరియా మాత్రమే ఉపయోగించాలన్నారు. చివరి దుక్కిలో సింగిల్ సూపర్ పాస్పెట్, డిఎపి ఎరువును ఎకరాకు ఒకటిన్నర బస్తా చొప్పున వేయాలన్నారు. వరి పైరుకు తప్పకుండా బీమా చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ స్వప్న, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి



కొండయ్యగారిపల్లె సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ రమేష్‌బాబు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపిడిఒ రమేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం కొండయ్యగారిపల్లె గ్రామ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలోని ఉద్యోగుల హాజరు రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్, పలు రికార్డులను పరిశీలించారు. సచివాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కొంతమంది ఉద్యోగులు సమయపాలన పాటించకుండా ప్రవర్తిస్తున్నారని అటువంటి వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఉదయం 10.30 లోపు సచివాలయ ఉద్యోగులందరూ విధులకు హాజరై తమ హాజరు నమోదును వేసుకోవాలని, సాయంత్రం 5 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ విధులను నిర్వర్తించాలని చెప్పారు. పనిపై కార్యాలయం నుంచి బయట వెళ్లే ఉద్యోగులు మూమెంట్ రిజిస్టర్‌లో కారణాలను రాయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే వినతులకు సత్వరమే పరిష్కారం చూపాలన్నారు. సెలవులపై వెళ్లే ఉద్యోగులు సంబంధించిన డిడిఒ ద్వారా ముందుగా ఎంపిడిఒను సంప్రదించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించే లక్ష్యాలను చేరుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. అధికారుల ఆదేశాలను ఉల్లంఘిస్తూ నిర్లక్ష్యంగా ప్రవర్తించే వారిపై తక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పింఛనుదారులకు సకాలంలో పింఛను అందించాలని, మిగిలిన పింఛను నగదును తిరిగి డిడిఒకు అప్ప చెప్పాలన్నారు. అనంతరం కొండయ్యగారిపల్లె డంపింగ్ యార్డును సందర్శించారు. డంపింగ్ యార్డ్ నుంచి ఎరువును తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చిరంజీవి, విఆర్ఒ శ్రీనివాసులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మోసం చేయడం చంద్రబాబు నైజం : వైసిపి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేయడం సిఎం చంద్రబాబు నైజమని వైసిపి నాయకులు ఆరోపించారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని తుమ్మనగుట్ట, గొల్లపల్లి, కోటూరు, బండావారిపల్లిలో బాబు ష్యూరిటీ-మోసంగ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబుకు ప్రజలకు ఇచ్చిన హామీల మీద చిత్తశుద్ధి లేదన్నారు. ప్రజలకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అన్నివర్గాలని మోసం చేసిందని ఆరోపించారు. జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల కన్నా ఎక్కువే ఇస్తామని ప్రగల్భాలు పలికారని అన్నారు. మహిళలకు పెద్దపీట వేస్తామన్న చంద్రబాబు వారిని నట్టేట ముంచారన్నారు. ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500లు అమలు చేయడం సాధ్యకాదని కూటమి మంత్రులే చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రజల పక్షాన వైసిపి పోరాటం సాగిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ప్రదీప్‌రెడ్డి, నియోజకవర్గ బూత్‌కమిటీ అధ్యక్షుడు రెడ్డిహరి, పట్టణ అధ్యక్షుడు సి.ఆర్. చిన్నికృష్ణ, వైస్ ఎంపిపి ఖాదర్‌వలీ, సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **తంబళ్లపల్లె:** కూటమి ప్రభుత్వ పాలనలో ఎటు చూసినా అభివృద్ధి జాడే లేదు సంక్షేమ ఊసే లేకుండా పోతుందని వైసిపి అధికార ప్రతినిధి జైసింహారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గుండ్లపల్లి, అన్నగారిపల్లె గంగిరెడ్డిపల్లె పంచాయతీలలో బాబుష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి క్యూఆర్ కోడ్ కరపత్రాలను పంచుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వివరిస్తూ ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. జగన్ పాలనలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి మారుమూల గ్రామాలకు సైతం తార రోడ్లు పల్లెల్లో సిసి రోడ్లు ప్రజల చెంతకే పాలన కోసం గ్రామ సచివాలయాలు, ఆర్‌బికె, ఆరోగ్య కేంద్రాలు, నాడు-నేడు కార్యక్రమంతో పాఠశాల అభివృద్ధి పల్లెల్లో మౌలిక వసతుల కల్పన కోట్ల రూపాయలతో పూర్తి చేశారన్నారు. కార్యక్రమంలో మండలపార్టీ కన్వీనర్ చౌడేశ్వరి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, సర్పంచులు మౌలాలి, బాబురెడ్డి, చెన్నకేశవరెడ్డి, నాయకులు రవినాయక్, తులసినాయక్ పాల్గొన్నారు.



బాబుష్యూరిటీ-మోసం గ్యారంటీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

బాధితులకు భరోసా సిఎం సహాయనిధి



రాజంపేట : బాధితులకు చెక్కులు అందిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఆర్థిక భరోసా ఇస్తుందని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఆర్థికసాయం మంజూరైన లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు భరోసా అందిస్తామని, రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్నా వాటన్నిటినీ పక్కనపెట్టి పేదల కోసం ఇప్పటివరకు రూ.400కోట్లకు పైగా ఖర్చు చేశామని తెలిపారు. ఎవరైనా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో సంప్రదిస్తే తప్పకుండా సిఎం సహాయనిధి ద్వారా సాయం అందిస్తామని చెప్పారు. అతికారి శ్రీనివాసులు రూ 1.36లక్షలు, నర్సాపురం మల్లేశ్వరి రూ.40వేలు, కొండూరు అమర్నాథ్ రాజు రూ.15వేలు, దండు లక్ష్మీ ప్రసన్న రూ 33వేలు, కొండూరు కృష్ణవేణి రూ.24,746లు, బాలిపోగు వెంకటేష్ రూ.30వేలు, రాజేశ్వరి బేబీ రూ.30,843లు, కుప్రపాటి శ్రీరంగయ్య రూ.75వేలు, సుబ్బరాజు రూ 80వేలు, ముఖ్యమంత్రి సహాయనిధి కింద చెక్కులను అందుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్య నాయుడు, కౌన్సిలర్ చంద్రమౌళి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు హనుమంతు నాయుడు, సిద్ధవటం నాగమునిరెడ్డి పాల్గొన్నారు.

పుల్లంపేట : ఓబులవారిపల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాలకు సంబంధించిన వారికి మంగళవారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. మండల పరిధిలోని బోటిమీదపల్లి పంచాయతీ కాకర్లవారిపల్లి గ్రామానికి చెందిన పోలిన సుబ్బరాయుడుకి రూ.84,928లు, అన్నంగి రామలమ్మకి రూ.71,664లు, పుల్లంపేట మండల పరిధిలోని వల్లూరుపల్లి గ్రామానికి చెందిన పోలి లలితమ్మకు రూ.1,40,966లు, పివిజిపల్లి గ్రామానికి చెందిన వెలగచర్ల శ్యామలకి రూ.42,833లు, పివిజిపల్లి పంచాయతీ కొండంపల్లి గ్రామానికి చెందిన ఎలక చర్ల రామయ్యకి రూ.33వేలు వారి గ్రామాల్లోని ఇంటికి వెళ్లి సీఎం సహాయనిది చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు ఎప్పుడు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ముక్కా విశాల్‌రెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి కుటుంబానికి సంక్షేమాన్ని అందిస్తున్నామని ఎమ్మెల్యే షాజహాన్ బాషా తెలిపారు. మండలంలోని కొండామర్రిపల్లి పంచాయతీ, వికలాంగుల కాలనీలో మంగళవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పార్టీ నాయకులతో కలసి ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం యేడాది కాలంగా ప్రజలకు చేసిన మంచి పనులను, అర్హులైన వారికి అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కొరారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అరా తీశారు. ప్రజల సమ స్యలను వెంటనే పరిష్కారం చేయాలని సంబందిత అధికారులను ఆదేశిం చారు. వికలాంగుల కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రాధా న్యత నిస్తామన్నారు. వికలాంగులు కాలనీ చెందిన షేక్ ఇర్ఫాన్‌బాషాకు రూ. 1.65 లక్షలు, భూదేవికి రూ. 35 వేలు సిఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జయరాం యాదవ్, వెంకటరమణ యాదవ్, సూదీళ్ల సుధాకర్, నవీన్ చౌదరి టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

రామాపురం :రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని యూనిట్ ఇన్‌ఛార్జి తుమ్మల ఓబులేసు, బూత్ ఇంచార్జ్ పుల్లగూర ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చిట్లూరు గ్రామం, పాలన్నగారిపలిలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. ఇప్పటి వరకు 85 శాతం పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అన్నక్యాంటీన్, పింఛ న్లపెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పథకాలతో ప్రజలు ఇప్ప టికే లబ్ది పొందారని అన్నారు. ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తున్నట్లు తెలపారు. గ్రామాలలో సిమెంట్ రోడ్లు, తాగునీటి సమస్యను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆయన సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల ఓబులేసు, పుల్లగూర ప్రభాకర, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

యుసిఐఎల్‌ను సందర్శించిన 'ఉస్మానియా' విద్యార్థులు

ప్రజాశక్తి - వేముల : అణుశక్తి విభాగం (డిఎఈ) 75వ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో భాగంగా హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం భూగర్భ శాస్త్ర విభాగం నుంచి విద్యార్థుల బృందం మంగళవారం తుమ్మలపల్లెలోని యుసిఐఎల్ కర్మగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భారతదేశ అణు ఇంధన చక్రానికి దోహదపడే యురేనియం మైనింగ్, ప్రాసెసింగ్ కార్యాచరణ అంశాలను విద్యార్థులకు ప్రత్యక్షంగా తెలియజేయడానికి ఈ విద్యా సందర్శన నిర్వహించారు. విద్యార్థులను యుసిఐఎల్ సీనియర్ అధికారులు స్వాగతించారు. ఈ సందర్శనలో గని స్థలం, ప్రాసెసింగ్ ప్లాంట్, పర్యావరణ నిర్వహణ, సౌకర్యాల గైడెడ్ టూర్ పర్యవేక్షించారు. తుమ్మలపల్లె నిక్షేపం భూగర్భ శాస్త్రం, ఆ ప్రదేశంలో ఉపయోగించే ప్రత్యేకమైన ఆల్కలీన్ లీచింగ్ టెక్నాలజీ, స్థిరమైన మైనింగ్ పద్ధతులకు కంపెనీ నిబద్ధతను యుసిఐఎల్ నిపుణులు వివరించారు. కార్యక్రమంలో కిషోర్ భగత్, సుమన్ సర్కార్, అమ్జద్ అలీ, ఎల్.రాజేష్, మోహన్‌రెడ్డి, వాసుదేవ్ రెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



75వ ప్లాటినం వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

ఇంటి పనులు ఆపేశాడని ఫిర్యాదు

ప్రజాశక్తి -ఎర్రగుంట్ల

గత ప్రభుత్వంలో జగనన్న కాలనీలో మంజూరైన ఇంటిని అధికారుల ప్రోత్సాహంతో కాంట్రాక్టర్‌కు ఒప్పించారని, ఆ కాంట్రాక్టర్ పనులు మధ్యలో ఆపివేశాడని పత్తిపాడు లక్ష్మీదేవి మంగళవారం మున్సిపల్ కమిషనర్ శేషఫణికి ఫిర్యాదు చేసింది. ప్రభుత్వం ఇచ్చిన డబ్బుతోపాటు అధికంగా రూ.35 వేలు ఆ కాంట్రాక్టర్‌కు ఇచ్చానని ఆమె పేర్కొంది. ఇంటి పనులను నాసిరకంగా చేయించాడని వాపోయింది. చేతగాని వారిని ఇతర రాష్ట్రాల వారిని పిలిపించి ఇంటి నిర్మాణ పనులు చేయించారని తెలిపింది. పూతలు ఇతరత్రా పనులు పెండింగ్ పెట్టారని, ఆయనకు చాలాసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. త్వరగా సొంత ఇంటిలోకి మారాలని అనుకుంటున్నామని తెలిపింది. అధికారులు స్పందించి ఆ కాంట్రాక్టర్ ద్వారా పనులు పూర్తి చేయించాలని కోరింది. కాలనీలో ఇంకా కొంతమంది ఇంటి నిర్మాణ పనులు ఆ కాంట్రాక్టర్ మధ్యలోనే ఆపివేశాడని లక్ష్మీదేవి తెలిపింది.

ఎమ్మెల్యే 'వరద'ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులురెడ్డిని మంగళవారం ఆయన స్వగ్రామమైన కామనూరులో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి గుండెకు శస్త్రచికిత్స హైదరాబాదులో చేయించుకుని స్వగ్రామానికి వచ్చారు. విషయం తెలుసుకున్న నారాయణరెడ్డి ఎమ్మెల్యేను కలిసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆక్షాంక్షించారు.



రైతులకు డ్రోన్లు పంపిణీ చేస్తున్న ఎడిఎ శివనారాయణ

80 శాతం రాయితీతో డ్రోన్లు పంపిణీ

ప్రజాశక్తి-చిన్నమండెం

రైతులకు 80శాతం రాయితీతో ప్రభుత్వం డ్రోన్లను పంపిణీ చేస్తోందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆర్‌బికెలో చిన్నారుసుపల్లె రైతు రవీంద్ర, శ్రీరామ సిహెచ్‌సి గ్రూపునకు 80శాతం రాయితీతో కిసాన్ డ్రోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఎఒ మాట్లాడుతూ డ్రోన్ వినియోగంతో సమయం ఆదావుతుందని, ఇది మంచి పథకమని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఃకార్యక్రమంలో రాయచోటి యూనియన్ బ్యాంక్ మేనేజర్ పెద్ద రెడ్డయ్య, ఎడిఎ శ్రీలత, గీత, ఆర్‌బికె సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనాలను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు తప్పవని వాహనదారులకు డిఎస్‌పి మహేంద్ర హెచ్చరిస్తున్నారు. పట్టణంలోని జ్యోతిచౌక్‌లో రోడ్డుకు అడ్డంగా నిలిపిన ద్విచక్రవాహనాలకు పోలీసులు జరి మానా విధించారు. రోడ్డుకు అడ్డంగా ఉంచిన బైక్‌లో స్టేషన్‌ను తరలించారు. ట్రాఫిక్ నిబంధనలపై ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ జీవన్ గంగాధర్‌నాథ్‌బాబు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలను నగర పంచాయతీ వారు కేటాయించిన స్థలంలోనే పార్కింగ్ చేయాల న్నారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు వాహనదారులు ,ప్రజలు, దుకాణదారుల సహకారం ఎంతో అవసరమన్నారు.

ఆదర్శ పాఠశాలను సందర్శించిన ఆర్‌జెడి

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను మంగళవారం ఆర్‌జెడి శామ్యూల్, డిఇఒ సుబ్రహ్మణ్యం సందర్శించారు. ఈ పాఠశాల పిఎంశ్రీ పథకం ఎంపిక కావడంతో మొదటి విడతలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఉన్నత శిఖరాలను అధిష్టించాలని ఆకాంక్షించారు.

నవోదయకు ఎంపికైన పూజ

ప్రజాశక్తి-మదనపల్లె



పూజ

స్థానిక రెడ్డీస్ కాలనీలోని శ్రీ భాస్కర డేకేర్(కోచింగ్ సెంటర్) విద్యార్థిని దేవర పూజ 6వ తరగతికి మదనపల్లె సమీపంలోని వలస పల్లిలోని జవహర్ నవోదయకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ బి.భాస్కర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కోచింగ్ సెంటర్‌లో నవోదయ పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. 2024లో కూడా తమ కోచింగ్ సెంటర్‌లో బి.విహాన్ కార్తిక్, సుంక వర్ష, బి.నందిని ఎంపికయ్యారని తెలిపారు. నవోదయకు ఎంపికైన పూజను అభినందించారు.

వేరుశనగ సాగులో మెలకువలు పాటించాలి

ప్రజాశక్తి - వేముల

స్థానిక రాచుకుంటపల్లి, ముబ్బు చింతలపల్లి గ్రామాల్లో మంగళవారం ఎఒ జిపి ఓబులేస్ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ఖరీఫ్ పంట స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రోన్ టెక్నాలజీ గురించి వివరిస్తూ రాబోయే రోజుల్లో రోబోటిక్ వ్యవసాయం క్రియాశీలకంగా మారునుందన్నారు. సాగులో ఉన్న వేరుశనగ పంట దిగుబడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వేరుశనగకు రక్షక పంటగా సజ్జ లేదా జొన్న చిక్కగా వేసుకోవాలని సూచించారు. తద్వారా రసం పీల్చే పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సురేష్, విహెచ్ఎ గోపి, రైతులు పాల్గొన్నారు.

ఇ-క్రాప్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - ఖాజీపేట

రైతులు సాగు చేసిన పంటలకు ఇ-క్రాప్ తప్పక నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి నాగార్చన సూచించారు. మంగళవారం మండల పరిధిలోని చెముళ్ళపల్లెలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద వరి పంటకు ఆగస్టు 15 వరకు మీ సేవా కేంద్రాలలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. అనంతరం పసుపు పంటను పరిశీలించి, సస్యరక్షణ చర్యలు వివరించారు.

13 మంది పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని చిన్నరసపల్లెకు ఎగువభాగాన ఉన్నటువంటి మామిడితోపు దగ్గర పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేసి 13 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వి.సుధాకర్ తెలిపారు. అరెస్టు చేసి వారి నుంచి 16 సెల్‌ఫోన్లు, రూ.2.59లక్షలు నగదు, 21 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు.

సెల్ఫీ తెచ్చిన తంటా..

రైల్లో నుంచి కింద పడిన విద్యార్థి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



గాయపడిన మహమ్మద్‌సఫాన్

సెల్ఫీ మోజులో పడి ఓ విద్యార్థి కదులుతున్న ట్రైన్‌లో నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మంగళవారం కురబలకోట మండలంలో జరిగింది. బాధితుని కుటుంబీకుల కథనం మేరకు.. కదిరి పట్టణం, మసీదువీధికి చెందిన నజీర్ కుమారుడు మహమ్మద్ సఫాన్ తిరుపతి నారాయణ కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. కళాశాలకు వెళ్లే నిమిత్తం కదిరిలో రైలు ఎక్కాడు. మార్గమధ్యంలోని కురబలకోట రైల్వే స్టేషన్ వద్ద సెల్ఫీ తీసుకుంటుండగా రైలు వేగంగా కదలడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన బాధితున్ని స్థానికులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రిఫర్ చేశారు. కేసు విచారణ చేస్తున్నట్లు కదిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ బాష తెలిపారు.